
# విజేత

తటవర్తి రామచంద్రరావు




'ఉమెన్ వెల్ఫేర్ సెంటర్‌లో చైతన్యం కలిగింది అంటే ఉదయం తొమ్మిది గంటలయిందని ఊళ్లో అందరికీ తెలుసు. వేరే గడియారం చూడనక్కరలేదు.

ఎంబ్రాయిడరీ అల్లికలో ఒక అమ్మాయికి మెళకువలు చెప్తూ తన పనిలో నిమగ్నురాలైంది శారద. అకస్మాత్తుగా తన చుట్టూ నిశ్శబ్దమావరించుకోవటం, ఆ అమ్మాయి తన చేతిమీద గీకుతూ.. ఏదో సంజ్ఞ చేయటం ఆమెను చకితురాల్ని చేశాయి.

గబుక్కున వెనుదిరిగి... తీక్షణమైన చూపులతో గంభీరంగా నిలబడి ఉన్న ఓ ఆజానుబాహువు విగ్రహాన్ని చూసింది. అతని వెనకే బాణాకర్ర కానుకుని కోరమీసం మీంచి మిర్రిమిర్రి చూస్తున్న మరో బలమైన విగ్రహం మరికొంత కథ చెప్పింది శారదకు.

చటుక్కున పైకి లేచి, "ఎవరు కావాలండీ?" అని అడిగింది ఆమె. అప్పటివరకు తనచుట్టూ ఉన్న వాళ్లల్లో చాలామంది ఆ గది దాటి వెనక చావిట్లోకి పోవటం ఆమె గుర్తించింది.

ఆ వ్యక్తి సమాధానం ఇవ్వలేదు. తన కుడి భుజంవైపు ఓ చూపు విసిరాడు.

"మీతోనే పనుండి వొచ్చా రయ్యగారు!" అన్నాడతను.

తన కొలీగ్‌వైపు తిరిగి, "వర్ధనమ్మగారూ! వీరిని కాసేపు ఆఫీసు గదిలో కూర్చోమని చెప్పండి!" అని చెప్పి జవాబుకయినా ఎదురు చూడకుండా వెనుక చావిడివైపు నడిచింది శారద.

అక్కడ గుమిగూడిన స్త్రీలంతా ఏదో గుసగుసలాడుకుంటున్నారు. శారదను చూసి అంతా ఆమెను చుట్టుముట్టారు.

"ఏం, అంతా అలా పారిపోయి వచ్చారు?" అని శారద అడిగింది.

అంతా ఒకరి ముఖాలింకొకరు చూసుకున్నారు. శారద రెట్టించేసరికి ఒకామె ధైర్యం చేసి చెప్పింది. "ఆయన మనూరి ప్రెసిడెంటుగారు!"

"అయితే?"

శారద నిర్లక్ష్యానికి అక్కడ స్త్రీలంతా నిర్ఘాంతపోయారు. కానీ, ఏం చెప్పాలో ఎలా చెప్పాలో ఎవరికీ అర్థం కాలేదు.

"ఒక మామూలు మనిషిని చూసి అలా దడుచుకునే మీరు జీవితంలో ఎలా పైకొస్తారు?"

ఒకామె గొంతు పెగల్చుకుంది. "ఆయనెంత ప్రమాదకరమైన మనిషో మీకు తెలీదు."

"అటువంటి మనిషికి మిమ్మల్ని ఓటెవ్వరెయ్యమన్నారు?"

శారద నిలదీసేసరికి ఎవరికీ నోరు పెగల్లేదు. ప్రెసిడెంటు రంగారావు గురించి ఆమెకావూరు వచ్చిననాడే వర్ధనమ్మ పూర్తి వివరాలు చెప్పింది.

"పులితోలు కప్పుకున్న మేకల్ని చూసి భయపడకండి. వచ్చి మీ పని చూసుకోండి. ఇక్కడికి మీరు ఎన్నో నేర్చుకోవటానికి వచ్చారు. ఎవరికయినా ఎందుకు భయపడాలి?"

శారద కంఠంలో, ప్రతి మాటలో, ప్రతి చూపులో, ఏదో గొప్ప శక్తి! అంతరాంతరాలలోంచి అవుననిపించే వింత ఆకర్షణ! ... అంతా మంత్రించినట్టు తమ పనుల్లో నిమగ్నులయిపోయారు.

ఒక అరగంటవరకు శారద తన పని హడావుడిలో ఉండిపోయింది.

"ఆయన మండిపోతున్నారమ్మా!" అని వర్ధనమ్మ వచ్చి చెప్పేవరకు ఆమెకు మరో విషయం గుర్తుకు రాలేదు.

వర్ధనమ్మ వెనకనే ఆమె ఆఫీసు గదిలోకి వచ్చింది. గుమ్మం దగ్గరే ముఖం కందగడ్డ చేసుకుని నిలబడి ఉన్నాడు ప్రెసిడెంటు రంగారావు.

"కూర్చోండి. ఇప్పుడు చెప్పండి మీకేం కావాలో?" అంది శారద చెక్కుచెదరని చిరునవ్వుతో.

దానితో మరింత రెచ్చిపోయాడు రంగారావు. "వర్ధనమ్మా! పంతులమ్మకి తామర చెరువు నీళ్లు వంటబట్టినట్టున్నాయే!"

శారద ముఖం జేవురించింది. "మీ వేళాకోళాలు వినటానికి నాకు తీరిక లేదు. మీరు వచ్చిన పనేమిటో చెప్పండి!"

గబుక్కున వర్ధనమ్మ అందుకుంది. "క్షమించండమ్మా! నేనే పరిచయం చేయటం మర్చిపోయాను. వీరు మన సమితి ప్రెసిడెంటు రంగారావుగారు."

"ఓహో! అందుకే కాబోలు అంతమంది ఆడవాళ్లు అక్కడ పనిచేసుకుంటుండగా లోపలికి వచ్చేశారు..."

"ఏమిటి నువ్వనేది?" రంగారావు అరిచాడు.

"మీరలా నా అనుమతి లేకుండా లోపలికి రావటం తప్పంటాను!"

ఆమె మాటలకి రంగారావు మండిపడిపోయాడు. "నువ్వెవరు నన్నడగటానికి?"

"అయ్యా! రంగారావుగారూ! నే నెవర్నో నాకు బాగా తెలుసు. స్త్రీ సంక్షేమ కేంద్రంలో మగవాళ్లకేం పని ఉంటుందో మాత్రం నాకు తెలీదు."

"ఈ కేంద్రం పెట్టించింది ఎవరో నీకు తెలుసా? నేను. నేనే తల్చుకుంటే..."

"మీరు గ్రామాధికారులు. తల్చుకుంటే కేంద్రాన్ని తెరిపించనూగలరు. మూయించనూగలరు. మీతో పొద్దున్నే వాదన వేసుకోవటానికి కాదు నాకు గవర్నమెంటు జీతం ఇస్తున్నది. ఇక్కడికి వచ్చిన వాళ్లకు కొద్దో గొప్పో నాకు తెలిసింది నేర్పటానికి... వర్ధనమ్మగారూ! అతిథిగా వచ్చినవారికి అమర్యాద చేయటం మన లక్ష్యం కాదు. వారికి కాఫీ తెప్పించండి!" అని రంగారావు వైపు తిరిగి

"క్షమించండి. నాకు ఇప్పుడు తీరిక లేదు. పని ఏమయినా ఉంటే సాయంత్రం నాలుగు తర్వాత రండి. అంతగా మీరు రాలేకపోతే నేనే వస్తాను. నాకేం అభ్యంతరం లేదు!" అని ఓసారి నమస్కారం చేసి వెనుదిరిగి చూడకుండానే చకచకా అడుగులు వేస్తూ కేంద్రం లోపలికి వెళ్లిపోయింది శారద.

నోట మాట రాక అంతటి ఆజానుబాహు విగ్రహమూ నీళ్లు కారిపోయింది. కుడిభుజం గంగడి నోరు తెరచినది తెరిచినట్టే ఉండిపోయింది.

వర్ధనమ్మ మాత్రం తెలియరాని భయంతో గజగజ వణికిపోయింది.

000

అటు పల్లె ఇటు పట్టణము కాని ఆ ఊళ్లో ఈ కేంద్రం స్థాపించబడి మూడేళ్లవుతున్నా శారద వచ్చేవరకూ చెప్పుకోతగ్గ అభివృద్ధి ఏమీ జరగలేదు. నిర్వహణ ఇద్దరిచేతులు మారిందే కానీ, స్త్రీ జనోద్ధరణ మాట దేవుడెరుగు ఆ కేంద్రానికి చెడ్డపేరు తీసుకువచ్చి మరీ వెళ్లారు.

రంగారావు చేతుల్లో కీలుబొమ్మలయి సంసార స్త్రీలు అడుగుపెట్టటానికి సరైన కేంద్రం కాదన్న చెడ్డపేరు తెచ్చి మరీ పోయారు గతంలో నిర్వహించినవాళ్లు.

ఎటొచ్చీ మొదటినుంచీ ఓ సహాయకురాలిగా ఉన్న వర్ధనమ్మ మాత్రం తన విధిని తాను నిర్వర్తించుకుని అటు నిర్వాహకురాలు ఒద్దికలోనూ, ఇటు గ్రామస్తుల నోళ్లల్లోనూ మంచిగానే మసలుకుంది.

నిర్వాహకురాలిగా కొత్తగా వచ్చిన శారద వర్ధనమ్మనిట్టే ఆకర్షించింది. పాతికేళ్ల పసిడి యౌవనంలో మనో నైర్మల్యాన్ని ముఖంలో ప్రతిఫలింపజేసుకుంటూ వర్ధనమ్మ నేమిటి కనిపించిన ప్రతి వ్యక్తినీ ఆకర్షించింది శారద!


ముఖంలో మాయని మందహాసం, చూపుల

## కరీనకు సంజూబాబా ఖితాబు!

సంజయ్‌దత్ సాధారణంగా ఎవరినీ పొగడనే పొగడడు. పొగిడాడూ అంటే ఏదో విశేషముండేవుంటుందని బాలీవుడ్ జనం చెప్పుకుంటారు. ఇటీవల సంజూబాబా దృష్టి కొత్తనాయికల మీద పడింది. అతను ప్రశంసించిన తొలి అమ్మాయి మోడల్ లీసారే. రెండోఅమ్మాయి బబిత-రణధీర్‌కపూర్ల రెండో కూతురు కరీనాకపూర్. 'రిఫ్యూజీ' చిత్రం హిట్ కాకపోయినా కరీన నటన మాత్రం అందరినీ ఆకట్టుకుంది. ఆ చిత్రం చూసిన సంజూ ఏమంటున్నాడంటే "కరీనలో వున్న ఆ తపన, 'ఫైర్' నాకు ఇటీవలి ఏ హీరోయిన్‌లోనూ కనిపించలేదు. ఇప్పుడున్న అందరు నటీమణుల్లోకీ చక్కగా నటించగల ఆకర్షణ గల నటి కరీనే!" అని. మరి ఆమె చిత్రాలే చెప్పగలుగుతాయి సంజయ్ జ్యోతిషం ఎంత నిజమో!

ఎస్.






చురుకుతనం, మాట మంచితనం ఆమెకు పెట్టని సొమ్ములు. విజ్ఞానానికి తోడు వివేకము, తాను చేపట్టిన పనిమీద అమితమైన శ్రద్ధ వర్ధనమ్మను అప్రతిభురాల్ని చేశాయి.

'వీళ్లు అడవి మనుషులు. వీళ్లని బాగుచేయటం ఎవరి తరం? ఈ ఉద్యోగాలు మనలాంటివాళ్లు పొట్టపోసుకోవటానికి కాకపోతే దేనికని...?' అంటూ అసహ్యంగా మాట్లాడిన గత నిర్వాహకురాలు కామేశ్వరమ్మకు; 'వీళ్లు అమాయక ప్రజలు. వీళ్లని అభివృద్ధికి తీసుకురావటమంటే మనం దేశాన్ని పురోభివృద్ధిలోకి తీసుకురావటమన్నమాట. ఇంటి యజమాని విజ్ఞానం చేయలేని పనిని ఇంటి ఇల్లాలి వివేకం అద్భుతంగా చేస్తుంది. ఒక పురుషుని చదివిస్తే అది అతనికే లాభం కానీ, ఒక స్త్రీని చదివిస్తే ఆ ఇంటినంతటినీ చదివించినట్టే!" అంటూ త్రికరణ శుద్ధిగా మాట్లాడిన శారదకు హస్తిమశకాంతర ముందనుకుంది వర్ధనమ్మ.

కొంచెం నేర్పరితనం ఉన్న వాళ్లను కూడా "మీవి ఉత్త మట్టిబుర్రలు. ఎన్నిసార్లు చెప్పినా అర్థం కాదు. ఇంతకన్నా జంతువులు నయం! మీకోసం నా గొంతు చించుకోవటం దండుగ!" అంటూ కసురుకునే కామేశ్వరమ్మకు చేతి పనులలో శ్రీకారం చుట్టిననాడే "మీ చేతిలో మంచి పనితనముంది. కోరిక ఉండాలే గానీ నేర్చుకోవటానికి పట్టుమని పది రోజులు కూడా పట్టవు!" అని కొందర్ని అమితంగా ప్రోత్సాహపరిచిన శారదకు మధ్యనున్న తేడాని ఆ గ్రామ ప్రజలు గుర్తించటానికి ఆట్టేకాలం పట్టలేదు.

ప్రతి ఇంటిలోనూ శారద గుణగణాల గురించి, ఆమె నేర్పుతున్న విద్య గురించి చెప్పుకోవటం మొదలుపెట్టారు.

పల్లెటూరిలో ఏ వార్త అయినా పాకి పారాడటానికి క్షణాలు పట్టవు. అందులో ఎక్కడ్నించో వచ్చిన పాతికేళ్ల పడుచు ఇంతమందికి మార్గదర్శిని కావటం ఆ గ్రామంలో మొట్టమొదటి వింత!

శారద ఆ ఊళ్లోకి వచ్చాక ... తనంతట తనే తన దగ్గరకి వచ్చి ఇదివరకటి వాళ్లల్లాగే అడుగులకి మడుగులొత్తుతుందనుకున్నాడు రంగారావు. ఆమె రాలేదు. సరికదా ఆమెకు చూచాయగా కబురుపెట్టినా పట్టించుకోలేదు. అతను గుక్కతిప్పుకునేలోగా ... శారదకావూళ్లో మంచి పేరు వచ్చేసింది. అదే అతనికి కొరుకుడు పడక ... ఆ పూట స్వయంగా కేంద్రంలో అడుగుపెట్టాడు.

ఊళ్లో తనకెంత అధికారముందో అందరిముందూ ప్రగల్భాలాడి ఆమెకు తెలియచెబుదామనుకున్నవాడికి వాస్తవంలో ఒక్కళ్లు ఎదురు తిరిగితే ఆ అధికారం గడ్డిపోచక్రింద లెక్క చేయవచ్చని ఆమె చేసి నిరూపించింది.

అతనికది భరించలేనంత అవమానకరం ... ఆ ఊరిలో నలుగురూ విడ్డూరంగా చెప్పుకునే వార్త అయ్యాయి. శారద మాత్రం ఏం జరగనట్టు తన పనిలో తను నిమగ్నురాలయిపోయింది.

000 000 000

శారద ప్రెసిడెంటు గారింట్లో అడుగు పెట్టేసరికి ఎవరూ ఎదురు రాలేదు.

ఆయన లేనట్టున్నాడు. ఆ పెద్ద మేడ బావురుమంటోంది. ఎక్కడా శుచీ శుభ్రం లేదు. 'డాబూ... దర్పం' ఉండగానే సరా, ఏం చూసి ఈయన్ని ప్రెసిడెంటుగా ఎన్నుకున్నారో అని ఆమె అనుకున్న క్షణంలోనే 'డబ్బు డబ్బు' అన్న నాదం పలికే ఆభరణాలు ఒంటినిండా దిగేసుకుని ఆ ఇంటి ఇల్లాలు కాబోలు ముందు వాకిట్లోకి వచ్చింది.

ఆవిడ ముఖం చిట్లించుకుంది. అదేం గుర్తించనట్టు తను చిరునవ్వు నవ్వింది శారద. "నమస్కారమండీ! ప్రెసిడెంటుగారున్నారా?"

"లేరు. నువ్వెవరు? ఆయనతో నీకేంటి పని?" ప్రతి నమస్కారం చేయలేదు కూర్చోమని చెప్పలేదు. పైగా ఏక వచన ప్రయోగంతో అసహ్యంగా ఆవిడ మాట్లాడుతుంటే శారదకు వెగటనిపించలేదు. జాలి వేసింది. ఇంటాయన కెలాగూ సంస్కారం లేదు. కనీసం ఇంటి ఇల్లాలికయినా మంచీ మర్యాద తెలియకుండా పోయాయే అని ఆమెకు బాధ కలిగింది.

"ఈ ఊళ్లో ప్రతి ఇంటితోనూ నాకు పని వుందమ్మా!" అంది సాధ్యమైనంత ఓర్పుతో.

"అంటే?"

"సెంటరు పేరు విన్నారనుకుంటాను."

"ఆఁ, వినకేం? బ్రహ్మాండంగా విన్నాను. అందరికీ ఏమిటేమిటో చెపుతున్నావటగా? ఆరు నూరయినా నే నక్కడికి వచ్చేది లేదు."

ఆవిడ మాట్లాడే తీరుకి, ముఖంలో తిరిగిన వంకరలకి శారదకి నవ్వొచ్చింది. బలవంతాన ఆపుకోగలిగింది. "ఆరు నూరూ అవదు. మీరక్కడికి రానూ రారు. రారని నాకూ తెల్సు!"

అప్పుడే అక్కడికో నాలుగేళ్ల పిల్ల ఊలు స్వెట్టరు తొడుక్కుని వచ్చింది. ఆ స్వెట్టరు చూడగానే శారద ముఖం వికసించింది. వెంటనే ప్రస్తావన మార్చేస్తూ, "ఆ స్వెట్టరు బావుంది కదూ! మీ అమ్మాయి అందులో ముద్దొస్తోంది!" అంది.

"మీ సెంటరులోదే... మా పిన్నిగారమ్మాయి చూపిద్దామని తెచ్చింది."

"అదెవరు అల్లారో తెలుసా?"

"తెలియదు."

అప్పుడే "అక్కోయ్!" అంటూ పదహారేళ్ల పిల్ల పరుగున అక్కడికి వచ్చి శారదను చూసి ఆనందాశ్చర్యాలలో మునిగిపోయింది.

"మాస్టారమ్మగారా?!"

"ఎందుకలా కంగారు పడతావ్ లక్ష్మీ?" అని శారద చిన్నగా నవ్వింది.

"మరే... మరే మా అక్కయ్యగారమ్మాయికి ఎలా వుంటుందో అని స్వెట్టరు తొడిగానండీ! రేపు ఇలాంటిదొకటి అల్లి ఇద్దామని!" అని ఆ పిల్ల నసిగింది.

"దాంట్లో తప్పేముంది? నేర్చుకుంటావనే కదా నీ కిచ్చాను."

ఆ పిల్ల తేలిగ్గా నిట్టూర్చి, "అరెరే! మీ రలా నిలబడి ఉన్నారేంటి? ఇలా కూర్చోండి..." అని ఓ కుర్చీ వేసి గబుక్కున లోపలకి వెళ్లిపోయింది.

ప్రెసిడెంటు శ్రీమతి పావుగంటలో రెండు లంఖణాలు చేసినదానిలా డీలా పడిపోయింది. ఇన్నేళ్లు వచ్చి తను చేయలేని పనిని తనకంటే చిన్నపిల్ల చేసి చూపెడుతోంది. ఎవరి నుండి ఆ పని తనం నేర్చుకుందో ...

"సెంటరు గురించి మీ కెవరో చెడుగా చెప్పినట్టున్నారు. లేకపోతే, మీరలా అనేవారు కాదు. మీరొకసారి వచ్చి చూడండి. మీకు నచ్చకపోతే మరెప్పుడూ రానక్కర్లేదు. మీరు గ్రామాధికారి భార్య. అక్కడికి వస్తే, సెంటరుకు ఎంతయినా పేరు వస్తుంది. మీ ఊరి ఆడవాళ్లకి దారి చూపాల్సింది ఎక్కడ్నించో వచ్చిన నేను కాదు. మీరు!"

శారద మాటలు పూర్తి కాలేదు. "... ఇంతకీ మొగుడి నొదిలేసి నీలా తైతక్కలాడమంటావు. అంతేనా?" రంగారావు గొంతు ఆ గది గుమ్మంలో ఖంగున మోగింది.

క్షణంపాటు అసహ్యంగా చూసింది శారద. "పెళ్లాన్ని వదిలేసేవాళ్లకే మొగుళ్లని పెళ్లాలు ఎందుకు వదిలేస్తారో బాగా తెలుస్తుంది. ఆ విషయం ఆలోచించటానికి నా కింకా పెళ్లే కాలేదు!"

"ఏం పాపం, ఎవడూ దొరకలేదా?"

శారద ముఖం ఎర్రనైంది. "అవును, నాకు సరయిన వాడు దొరకలేదు. దొరికినరోజున మిమ్మల్ని పెళ్లికి పిలవకపోనులెండి!"

ఆమె ముఖం మీద సవాలులాంటి చిరునవ్వు రంగారావును మంటబెట్టింది. ఎదురుగా తన భార్య అక్కడ లేకపోతే ఏం చేసేవాడో .... తనకే తెలియదు అనుకున్నాడు.

ఇంతలో లక్ష్మి పొగలు కక్కే కాఫీ కప్పుతో అక్కడికి వచ్చింది. ఆ కప్పు అందుకుంటూ "మీ అక్కగారికీ, బావగారికీ కూడా తీసుకురా, లక్ష్మీ!" అంది శారద.

లక్ష్మి మరో రెండు కప్పులతో వచ్చేవరకూ శారద కాఫీ తాగలేదు. ఇదంతా ప్రెసిడెంటు భార్య గమనిస్తూనే ఉంది. శారద ఒక అపూర్వమైన స్త్రీ అనిపించిందామెకు.

కాఫీ తాగాక, "మీతోనే పనుండి వచ్చాను!" అని రంగారావువైపు తిరిగింది శారద.

నిర్లక్ష్యంగా చూశాడు రంగారావు. "నువ్వు గొప్పదానివి. మాలాంటోళ్లతో నీకేం పనుంటుంది?"

శారద అలాంటి మాటలకలవాటు పడినదానిలా తల పంకించి నవ్వింది.

"ఏది ఏమయినా నా కోసం నేను రాలేదు. సెంటర్ అభివృద్ధికి మీ సాయం ఎంతయినా అవసరం. ఆ సంగతి చెప్పటానికే వచ్చాను. సెంటర్‌లో ఉన్న నాలుగు గదులు ఇప్పుడు వచ్చేవాళ్లకు చాలటంలేదు. తొందరలో మరికొందరు చేరతామంటున్నారు. మీరు బి.డి.వో.గారితో చెప్తే ఫండ్స్‌కి ఏర్పాటు చేస్తారు. మీకు మంచి పేరు వస్తుంది!"

"అదేదో నువ్వే బావుకోరాదూ!" కసిగా అన్నాడు రంగారావు.

శారద మళ్లీ నవ్వింది. "ఇంట్లో ఎవరు మంచి చేసినా ఇంటాయనకే పేరు వస్తుంది. అలాగే ఊరు విషయమూనూ... వర్ధనమ్మగారూ, నేనూ సెంటరు ఖాళీ చేస్తున్నాము. ఎక్కడయినా అద్దెకు ఉంటాము. ప్రస్తుతానికి ఆ రెండు గదులూ మరికొందరికి చోటిస్తాయి. ఇక మీదట ఓ పెద్ద ఇల్లు చూసుకుంటే కానీ సెంటర్‌ని నడపటం కష్టం. మీరు గ్రామాధికారులు కనుక మీకు చెప్పాల్సింది చెప్పాను. ఆపైన మీ ఇష్టం. సెలవు... వస్తానండీ!" అని ప్రెసిడెంటు గారి భార్యకు నమస్కరించి వాళ్లమ్మాయి బుగ్గ పుణికి ముద్దెట్టుకుని తన హేండ్‌బాగ్‌లోంచి తీసి తాను కుట్టిన పువ్వుల చిలుకను ఆ పిల్ల చేతిలో పెట్టి ఆ దంపతులు గొంతు పెగల్చుకోటానికి ముందే అక్కడనుంచి నిష్క్రమించింది శారద.

000 000 000

అహంకారం ఒక్కోసారి ఎంతటి హానికయినా తలపడేలా చేస్తుంది. తనని ఏ విషయంలోనూ లెక్కచేయకుండా అందరి మన్ననలూ పొందుతున్న శారద రంగారావుకి కొరకరాని కొయ్య అయిపోయింది. ఆమె నెలాగయినా లొంగదీసుకోవాలని అతనిలో పట్టుదల కలిగింది.

శారదపై నానా హీనంగా చాడీలు చెప్పి ఆమె ఉద్యోగానికే ఎసరు పెట్టాలని బిడివోని ఒకసారి వచ్చి చూడమన్నాడు రంగారావు. ఆమె చరిత్ర తెలిసి వుంటే అతనింత పిచ్చిపని చేసేవాడు కాదేమో!

వారం వారం 'సెంటర్ ప్రోగ్రెస్' మీద శారద రిపోర్టు పంపుతోందని, ఇదివరకొక గ్రామంలో ఆరు నెలల్లోనే ఎంతో అభివృద్ధి సాధించి వచ్చిన వ్యక్తిగా బిడివోకి బాగా తెలుసునని రంగారావుకి తెలియదు.

బిడివోగార్ని వెంటబెట్టుకుని అతను ఊళ్లోకి వచ్చేసరికి శారద ఒక అద్భుతం చేసి చూపెట్టింది. సెంటర్‌ని పూర్తిగా అలంకరించారు. పాతికమంది ఆడపిల్లలు వాలంటీర్లుగా 'బాడ్జెస్' తగిలించుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చిన నెలరోజులలోగా శారద చూపించిన అభివృద్ధికి తార్కాణంగా కుట్లు, అల్లికలు, బొమ్మలు మొదలైనవి నాలుగువందల వస్తువులదాకా అక్కడ తరగతులవారీగా పేరుపేరునా ప్రకటించి ప్రదర్శించారు. అక్కడున్న ప్రతి వస్తువులోనూ, ప్రతి అలంకరణలోనూ నిర్వాహకురాలి కళాహృదయం, అవిరళ దీక్ష, హృదయ నైర్మల్యం, మంచి నేర్పు ప్రస్ఫుటమవుతున్నాయి.


సభ ఏర్పాటయింది. నాలుగువందలమంది దాకా హాజరయినారు. వేదికమీదకి బిడివోగార్ని, ప్రెసిడెంటుగార్ని ఆహ్వానించింది శారద.


ముఖం కందగడ్డలా చేసుకుని వైదికపైకి వెళ్లాడు రంగారావు.

"ఈ కేంద్రం యొక్క అభివృద్ధి ఈ ఊళ్లో ప్రతి ఒక్కరి మీదా ఆధారపడి ఉంది. మీరంతా సహకరిస్తే ప్రభుత్వం కూడా సహాయం చేస్తుంది. మన సెంటర్‌కి తగినంత చోటులేక అనేకమంది చేరలేకపోతున్నారు. అందుకని ఒక ప్రత్యేకంగా ఒక పెద్ద బిల్డింగు కట్టిస్తే బావుంటుందని నేను ప్రెసిడెంటు గారితో చెప్పాను. ఆయన బిడివోగార్ని తీసుకువచ్చారు. ఇన్నాళ్లకు మన ఆశ ఫలించింది!"

తన మాటలకి బిడివోగారు, ప్రెసిడెంటుగారు ఒకరి ముఖాలింకొకరు చూసుకోవటం శారద క్రీగంట గమనించకపోలేదు. బిడివోగారు చిన్నగా నవ్వుకోవటంతో రంగారావు ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్క లేకుండా పోయింది.

"ఏమయినా పూర్తి బాధ్యత ప్రభుత్వంపై పెట్టటం మనకి ధర్మం కాదు. మనం కూడా మన శక్తికొద్దీ ఈ సంస్థకోసం వెచ్చించటం న్యాయం.






ఎవరికి తోచింది వారిచ్చి ఈ మహత్కార్యాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరుకుంటున్నాను. నా శక్తికొద్దీ ఒక నెల జీతాన్ని నేను నా చందాగా సమర్పిస్తున్నాను. ఈ సభకు విచ్చేసిన అధికారులకు, అక్కచెల్లెళ్లకు, అన్నదమ్ములకీ అందరికీ నా వందనాలు!"

ఆ తర్వాత రంగారావు పరాజయాగ్నిలో ఆజ్య ధారలై చందాలు కురిశాయి.

000

రాత్రి పది గంటలు దాటింది. పగలు పడిన శ్రమకు కళ్లు మూతలు పడుతున్నా మరునాడు తాను సెంటర్‌లో చేయవలసిన పనికి నోట్స్ రాసుకుంటోంది శారద.

తలుపు తట్టిన చప్పుడయ్యేసరికి చకితురాలైంది. ఒక్క క్షణం ఆమె గుండెలు దడదడలాడాయి. వెంటనే నిలదొక్కుకుని నెమ్మదిగా తలుపు తీసింది. ఊహించిన వ్యక్తే ఎదురుగా ఉండేసరికి ఆమె తొణకలేదు.

రంగారావు కళ్లు చింతనిప్పుల్లా మండుతున్నాయి. కొంచెం తాగి వచ్చాడని శారద పసిగట్టింది.

"ఓహో( ప్రెసిడెంటుగారా! రండి రండి... మీరు వస్తారని అనుకుంటూనే ఉన్నాను."

తబ్బిబ్బయ్యాడు రంగారావు. తనను చూసి భయపడుతుందనుకున్నది జరగలేదు సరికదా నవ్వుతూ రమ్మనమంటోంది ఈమె. ఇదేం చిత్రం...! అనుకుంటూ నిలబడిపోయాడు.

"వచ్చి కూర్చోండి. ఇంత అర్ధరాత్రి వస్తారని తెలిసినా మీ కోసం ఏమీ తయారుచేయలేకపోయాను. క్షమించాలి మరి!"

తూలుతూ వచ్చి కుర్చీలో కూలబడ్డాడు రంగారావు.

ఫ్లాస్క్‌లోని కాఫీ కప్పులో పోసి తెచ్చింది శారద. "త్రాగండి!"

"ఏంటది?"

"కాఫీ!"

"వద్దు."

"ఎందుకు? మీరు మీ ఇంట్లో కాఫీ తాగుతారుగా?"

"దీనికోసం రాలేదు నేను."

"దేనికోసం వచ్చారో నాకు తెల్సు. ముందిది తాగండి!"

ఇంకేమనగలడు? గబగబా కాఫీ తాగేశాడు అతను.

"ఇప్పుడు చెప్పు..."

"ఒక్క క్షణం ఉండండి..." అంటూ పక్క గదిలోకి వెళ్లి రెండు నిమిషాల్లో తిరిగి వచ్చింది.

ఆమె చేతిలో ఉన్నది చూసి గతుక్కుమన్నాడు అతను. "ఏమిటిది?"

"కొంచెం పరీక్షగా చూడండి...!" అని ఎత్తి పట్టుకుంది.

"పసుపుకొమ్ము..."

"ప్రతి ఆడదానికీ కావాల్సింది."

"ఇంతకీ ఏమిటంటావు?"

"నా మెడలో ఇంతవరకూ ఎవరూ పుస్తె కట్టలేదు. ఆ తృప్తయినా కనీసం దక్కాలని."

"ఓహో(... పుస్తెలు కావాలా నీకు?"

"అహ(... పసుపుతాడు చాలు!"

రంగారావు గలగల నవ్వాడు. "నాకేం అభ్యంతరం లేదు!"

"మీకు లేకపోతే మీ భార్యకుంటుంది కదా!"

"అదెవరు నన్ను అడ్డుపెట్టటానికి? గొడవపెడితే పుట్టింటికి పొమ్మంటాను!"

శారద ఫక్కున నవ్వింది. "రోజులు మారాయి ప్రెసిడెంటు గారూ! కోర్టు కీడుస్తుంది మీ భార్య. ఒక భార్య ఉండగా మరో పెళ్లికి చట్టం ఒప్పుకోదు."

"దాని ముఖం. దానికా సంగతులేవీ తెలీవు."

"తెలీకపోతే చెప్పేవాళ్లు లోకంలో లేకపోలేదు."

"అంతదాకా వస్తే విడకులిచ్చేస్తాను."

"ఇదంతా నాకోసమేనా?"

"అవును. నువ్వు నాకు నచ్చావు. అందుకని..."

"సరే, కొంచెం వీధి తలుపు వేసేసి రండి... నే నీలోగా చీర మార్చుకువస్తాను."

హుషారుగా లేచి ఆమె చెప్పిన పని చేశాడు రంగారావు. పక్క గది తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి. ఆమె చీర కట్టుకుంటోంది కాబోలు! అతనికెంతో కులుకుగా ఉంది. 'ఎంతో మొండిది. బెట్టు చేసి నానా గొడవ చేస్తుంది... బలవంతంగా లొంగదీసుకోవాలి' అని అనుకుంటూ తను వచ్చాడు. ఇంత సుళువుగా లొంగిపోవటం అతనికి తెగ ఆశ్చర్యంగా ఉంది. 'పసుపుతాడు కట్టించుకుని మరీ దగ్గరకి వస్తుందిట! ఎంత ఘటికురాలు!' పెళ్లాడితే ఇలాంటిదాన్నే ఆడాలి...!

అతని ఊహాగానం పూర్తికాలేదు. బయట కిటికీ వద్ద శారద గొంతు వినిపించి ఉలిక్కిపడ్డాడు రంగారావు. తాగిన మత్తు విడిపోయింది. తరిపార చూశాడు. ఆమె చీర మార్చుకోలేదు. "ఏం చేస్తున్నావక్కడ?" అని కంగారుగా అడిగాడు.

"మీ భార్య ధనలక్ష్మమ్మగారు పాపం ఇక్కడ చీకటిలో కూర్చుంటే బావుండదని..."

రంగారావు ముఖం జేవురించింది. "అదెందుకు వచ్చింది?"

"స్వయంగా నా పెళ్లి చూసి, అక్షింతలు వేద్దామని!"

శారద నవ్వు చూసేసరికి ఏం జరిగిందో అతనికర్థమయిపోయింది.

"రాక్షసి...!" అని అరిచాడు.

"అదేంటండీ... ఇంతకు ముందే కదా నే నెంతో నచ్చానన్నారు మరి!"

"నిన్నేం చేస్తానో చూడు!" తలుపు తీసి బయటకు రావటానికి ప్రయత్నించాడు రంగారావు. కానీ, అవి తెరుచుకోలేదు.

ఏం జరిగిందో అతనికర్థమయింది. చీర కట్టుకుంటానని పక్క గదిలోకి వెళ్లి అక్కడ గడియపెట్టి రెండో గుమ్మం ద్వారా బయటకు వెళ్లి వీధి తలుపుకు బయట గొళ్లెం పెట్టింది శారద.

కళ్లల్లో కారం కొట్టి పారిపోయినట్టు చేసింది ఆమె. బోనులో సింహంలా కలయదిరిగాడు రంగారావు. కిటికీ దగ్గర తల దించుకుని నోట

మాట రాక నిలబడి ఉన్న భార్యను చూసేసరికి అతను మరీ రెచ్చిపోయాడు. ఆమెను నోటికి వచ్చినట్టు తిట్టసాగాడు.

"... మీరు అందర్నీ పిలవాలంటే అంత కష్టపడి గొంతు చించుకోనక్కర్లేదు. నేనే వెళ్లి పిల్చుకువస్తాను!"

రంగారావు కొయ్యబారిపోయాడు.

"వద్దమ్మా! అంత పని చేయకు!" అంది ధనలక్ష్మి కంగారుగా.

"నువ్వు నోర్మూయ్యవే దరిద్రమొహమా! నువ్విక్కడికి ఎందుకు చచ్చావే!" అంటూ భార్యను కసురుకున్నాడు రంగారావు.

"అర్థమయిందా అమ్మా ... మీ భర్త ఎంత గొప్పవాడో! ఒక ఆడపిల్ల పైకి రావటం భరించలేక అసూయతో మగవాడినన్న అహంకారంతో ఎంతవరకు వచ్చారో చూడండి. ఈయనలో ఏం గొప్పతనం ఉందని ఈయనకి దాసోహం అనాలి? గౌరవంగా నేను పిలుస్తుంటే ... 'నువ్వు నువ్వు' అని గేలి చేస్తున్నందుకా? ఆడవాళ్లు పనిచేసుకునే సెంటర్‌లోకి మగవాళ్లకేం పని అని అడిగినందుకు ఉలుక్కుని 'తామర చెరువు నీళ్లు వంట పట్టించుకున్నానని' ఎకసెక్కాలాడినందుకా? మీ ఇంటికి వచ్చి మీకు పెద్దరికం కట్టబెట్టి సాటి ఆడవాళ్లల్లో మిమ్మల్ని పెద్దదాన్ని చేయాలని నేను రండని అంటే తైతక్కలాడుతున్నానని నన్ను అవమానించినందుకా ఏం చూసుకుని ఈయనకీ అహంకారం? డబ్బుందనే కదా? ఈ క్షణంలో ఆయన డబ్బు ఆయన పరువెలా కాపాడుతుంది?"

వాళ్లిద్దరికీ గొంతులు పొడారిపోయాయి.

"ఎప్పుడు మిమ్మల్ని పాత ఇంటినుంచి ఇక్కడికి మార్చేలా ఏర్పాటు జరిగిందో అప్పుడే ఆయన నాపైన పగగట్టారని గ్రహించాను. ఈవేళ వర్ధనమ్మగారు ఊరికి వెళ్లిందని... ఇలాంటి అవకాశం కోసం ఈయన ఎదురు చూస్తాంటారనీ ఎరుగుదును. అందుకనే లక్ష్మి ద్వారా ముందు మీకు కబురు పంపాను. మీరు కళ్లారా మీ భర్తగారి ఘనకార్యం చూసుండకపోతే ... నేనేం చెప్పినా మీరు నమ్మేవారేనా?..."

నోట మాట రాక నీళ్లు కారిపోతున్నాడు రంగారావు. ధనలక్ష్మి మరింత క్రుంగిపోయింది.

"... సెంటరు కట్టించారని అందర్నీ ఆయన చెప్పుచేతల్లో ఉంచుకోవాలనుకున్నారు. కానీ, ఇది ప్రజల డబ్బుతో కట్టించినది. ఆ ప్రజలకోసమే ఈయనకీ పెద్దరికం ఇచ్చినది. ప్రెసిడెంటుగా ఈయనను ప్రజలు ఎన్నుకున్నారంటే ఈయన గొప్పతనం చూసి కాదు. బాగా డబ్బుంది కనుక. పెద్ద భూకామందులన్న భయం వల్ల ఆయనకి ఓట్లు వేశారు... ఇలాంటి గొప్ప మనిషి ఇలా నా ఇంట్లో ఎందుకు బందీగా పడి వున్నాడో తెల్లవారితే ఊరందరికీ తెలుస్తుంది. అప్పుడు? ఆ అపకీర్తిని మీ డబ్బు కాపాడుతుందా? ... చదువు లేదు. కనీసం సంస్కారమయినా లేదు. ఏవి లేకపోయినా, మంచి మనసయినా ఉంటుందనుకుంటే అదీ లేదు. ఏ విషయంలో చూసినా నాకు తగినవాడుకాదే ఇంక నే నెలా పుస్తె కట్టించుకుంటా ననుకున్నారో మరి!..." అని కసిగా ఫక్కున నవ్వింది శారద.

"... ఇంకా ఎందుకమ్మా! చచ్చిన పామునే కొడతావు?" ధనలక్ష్మి గొంతు గాద్గదికమయింది.

శారద మనస్సు కరిగిపోయింది. "నేనంత చెడ్డదాన్ని కాదమ్మా! మీ భర్తని మీ ఎదురుగా నిందిస్తుంటే మీకదెంత బాధగా ఉంటుందో నే నూహించగలను. అందుకే నాకు జరిగిన అవమానానికి నా గుండెలెంత మండిపోతున్నా, సాటి ఆడదానికి నా వల్ల అవమానం జరగకూడదనే నన్ను నేను నిగ్రహించుకుంటున్నాను. మీ ఆయన చేసిన అవమానానికి ప్రతీకారం చేయాలనుకునేదాన్నయితే ఈపాటికి ఊరు ఊరంతా ఇక్కడికి వచ్చేలా చేసుండేదాన్ని.... కానీ, అది నా ఉద్దేశ్యం కానేకాదు!"

"నీది చాలా గొప్ప మనసమ్మా!" అని అతి కష్టంమీద గొంతు పెగల్చుకోగలిగింది ధనలక్ష్మి.

"నేను అనాథగా పుట్టాను. అనాథగానే పెరిగాను. నాకు నావాళ్లంటూ ఎవరూ లేకపోయినా నే నిక్కడుంటే నా చుట్టూ ఉన్నవాళ్లంతా నా వాళ్లనుకుని అభిమానిస్తున్నాను. నా అధృష్టవశాత్తూ నా కింతవరకూ అభిమానించేవాళ్లే దొరికారు. మొట్టమొదటిసారి దొరికిన చేదు అనుభవం ఇక్కడే! ఆడది పైకి వస్తుంటే అసూయపడే ఈయన్ని చూసి నేను జాలిపడ్డానే కానీ కోపగించుకోలేదు. ఇవాళ నన్ను బలవంతం చేసి పాడుచేద్దామని పథకం వేసుకుని వచ్చారని తెలిసినా కూడా నే నాయన్ని నిందించలేదు. తన తప్పు తెలుసుకుంటారేమోనని అనేక విధాల ప్రయత్నం చేశాను. మీరు కిటికీ చాటునుంచి వింటున్నారని నాకు తెలుసు కనుకనే ఆయనతో అలా మాట్లాడాను. అంతేకానీ, ఆయన్ని బాధపెట్టాలనీ కాదు, మిమ్మల్ని చిన్నబుచ్చాలనీ కాదు. ఆడదాని అభివృద్ధి భరించలేని మగవాడికెప్పుడూ పరాజయమే! అది ఈయన గ్రహించకపోవటం దురదృష్టం. నా అవసరం తీరిపోతే నే నీ వూళ్లో ఒక్క క్షణం ఉండను. సాటి ఆడవాళ్లకి కొద్దో గొప్పో నాకు తెలిసింది నేర్పి మంచి అలవాట్లు వచ్చేలా చేయాలని ఈ ఊరు వచ్చానే కానీ, ఏ భార్యాభర్తల్నీ విడదీద్దామని కాదు, ఏ సంసారంలోనూ చిచ్చుపెట్టాలనీ కాదు! మీ భర్తని మీరు తీసుకువెళ్లండి!" అంటూ శారద తలుపు గొళ్లెం తీసింది.

కోరలు తీసిన పాములా ముడుచుకుపోయిన రంగారావుకి తలెత్తి శారదను చూసే ధైర్యం లేకపోయింది.

"నీ మేలు జన్మలో మరిచిపోలేనమ్మా!" అంది ధనలక్ష్మి.

"ఈ విధంగానయినా మీరు నా ఇంటికి వచ్చారు..." అంటూ కుంకుమ భరిణతో వచ్చి ఆవిడకు బొట్టుపెట్టింది శారద.

ఆమె వ్యక్తిత్వం ముందు చలిచీమంత చిన్నవాడయిపోయినట్టు కుంచించుకుపోయాడు రంగారావు. ఆమె ముఖంలోకి చూసే స్థైర్యం లేక తడబడే అడుగులతో బయటకు వెళ్లిపోయాడు.

శారద చేతులు పట్టుకుని తన కళ్లకద్దుకుని మందగమనంతో. అతని వెనుకనే నడిచి వెళ్లిపోయింది ధనలక్ష్మి.

వాళ్లలా కనుమరుగయిపోయేవరకూ దీపకళికలా అక్కడే నిలబడిపోయింది శారద!

■

